నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 9 మార్చి 2025 RANGAREDDY

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైంది. గత కేసీఆర్ హయాంలో జిల్లాలో పారిశ్రామిక వేత్తలు విరివిగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురాగా..ప్రస్తుతం రేవంత్ సర్కార్ తీసుకుంటున్న చర్యలతో భూములు, ఫ్లాట్లు, విల్లాల కొనుగోలుతో పాటు పెట్టుబడులు పెట్టేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే, ఇప్పటికే ఈ రంగంలో పెట్టుబడులు పెట్టిన వారు క్రయవిక్రయాల్లేక.. అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా ఈ రంగాన్ని నమ్ముకున్న వేలాది మంది ఉపాధి కరువై రోడ్డున పడుతున్నారు. కాగా, బీఆర్ఎస్ హయాంలో భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రతిఏటా రూ.వేల కోట్ల ఆదాయం సర్కార్‌కు సమకూరగా.. ప్రస్తుతం రూ.100 కోట్లు కూడా దాటడం లేదని సమాచారం.



-రియల్ ఎస్టేట్ కుప్పకూలంగా మధ్యలోనే నిలిచిపోయిన భవన నిర్మాణం

# రియల్..ఢమాల్

## కాంగ్రెస్ పాలనలో కుదేలైన స్థిరాస్తి వ్యాపారం

**ఉమ్మడి రంగారెడ్డిలో ఆత్మహత్యలు చేసుకుంటున్న రియల్ వ్యాపారులు**

- కేసీఆర్ హయాంలో ఈ రంగంలో రారాజుగా వెలుగొందిన రంగారెడ్డి జిల్లా
- రేవంత్ సర్కార్ తీసుకుంటున్న చర్యలతో తగ్గిన భూములు, అపార్ట్‌మెంట్లు, విల్లాల క్రయవిక్రయాలు
- రోడ్డున పడిన రియల్ బ్రోకర్లు..



రంగారెడ్డి, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : రియల్ ఎస్టేట్ రంగంలో రాష్ట్రానికి గుండెకాయ లాంటి జిల్లా కాంగ్రెస్ సర్కార్‌లో కుదేలైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెట్టుబడుల కోసం పారిశ్రామికవేత్తలు అధికంగా తరలిరావడంతో ఈ రంగంలో జిల్లా రారాజుగా వెలుగొందింది. అయితే ..15 నెలల కిందట కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రావడంతో రియల్ ఎస్టే ట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ రంగంలో రూ. వేల కోట్లు పెట్టుబడులు పెట్టిన అనేక మంది వ్యాపారులు క్రయవిక్రయాల్లేక తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతుండగా.. ఈ రంగాన్నే నమ్ముకున్న వేలాది మంది ఉపాధి కరువై రోడ్డున పడుతున్నారు. కేసీఆర్ హయాంలో మన జిల్లా నుంచే సర్కార్‌కు ప్రతి ఏటా రూ. వేల కోట్ల ఆదాయం వచ్చేది. ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, భూముల క్రయవిక్రయాలకు జిల్లా పెట్టింది పేరుగా ఉండేది. అనేక ప్రాంతాల్లోని విల్లాలు, అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మంది ప్రస్తుతం వాటిని తిరిగి అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే, బిల్డర్లు పెద్ద ఎత్తున నిర్మించిన అపార్ట్ మెంట్లల్లోని ఫ్లాట్లు, విల్లాలు అమ్ముడు పోక బ్యాంకుల నుంచి తీసుకొచ్చిన అప్పులు కట్టలేక చేతులెత్తేస్తున్నా రు. ఇప్పటికే అమ్మకాలు, కొనుగోళ్ల కోసం చేసుకున్న ఒప్పందాలు సైతం నిలిచిపోవటంతో బాధితులు కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, జిల్లా లో 18 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా.. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా అధిక సంఖ్యలో భూముల రిజిస్ట్రేషన్లు జరిగి రూ. 300 కోట్ల వరకు ఆదాయం సర్కార్‌కు సమకూరేది. కానీ, ప్రస్తుతం రూ.100 కోట్లు కూడా దాటడం లేదని సమాచారం.

### రంగారెడ్డి జిల్లాలో రూ. వేల కోట్ల నుంచి రూ. వందల కోట్లకు తగ్గిన ప్రభుత్వ ఆదాయం

### నిలిచిన క్రయవిక్రయాలు..

బీఆర్ఎస్ హయాంలో పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్, ఆదిబట్ల, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, నార్సింగి, గండిపేట, శంకర్‌పల్లి వంటి పలు మున్సిపాలిటీల్లో బిల్డర్లు పెద్ద ఎత్తున విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించారు. అయితే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో విక్రయాలు నిలిచిపోయాయి. అనేక నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అప్పులు తీసుకొచ్చి నిర్మించిన విల్లాలు, అపార్ట్‌మెంట్లు అమ్ముడుపోకపోవడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అప్పుల పాలవుతున్నారు. పై ఉన్న మున్సిపాలిటీల్లో ఇప్పటికే రూ. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. ఈ రంగం ఢమాల్ కావడంతో రియల్‌ఎస్టేట్ బ్రోకర్లతోపాటు వ్యాపారులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యక్షంగా...పరోక్షంగా జిల్లా శివారులో సుమారు 50,000 మందికి పైగా ఈ రంగంపై ఆధారపడ్డారు. వారంతా ఉపాధిని కోల్పోయారు. అనేక రియల్ ఎస్టేట్ కార్యాలయాలు మూతపడ్డాయి. అదేవిధంగా ప్రీ లాంచింగ్‌లో భాగంగా ముందే డబ్బులు చెల్లించి బుక్ చేసుకున్న వా రు నేటికీ బిల్డర్లు అపార్ట్‌మెంట్లు, విల్లాలు అప్పగించకపోవడంతో లబోదిబోమంటున్నారు. గతంలో పైన పేర్కొన్న మున్సిపాలిటీల్లో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు క్రయవిక్రయదారులతో కళకళలాడేది. నేడు వెలవెలబోతున్నాయి.

### కుప్పకూలింది..

వికారాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నేవీ రాడార్ కేంద్రంతో రియల్‌ఎస్టేట్ మొత్తం కుప్పకూలింది. ఇక్కడి భూములను కొనేందుకు ముందుకొచ్చిన రియల్టర్లు.. రాడార్ కేంద్ర ఏర్పాటుకు జరిగిన శంకుస్థాపన విషయం తెలిసి చుట్టు పక్కన ప్రాంతాల్లోనూ భూములను కొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఏడాది కిం దటి వరకు ఇక్కడ రూ. కోట్లు పలికిన భూములను సగం ధరకు అమ్ముతామన్న ఎవరూ కొనేందుకు ఆసక్తి చూపని పరిస్థితి నెలకొన్నది. గతంలో భూములను కొనుగోలు చేసే చాలామంది ఫామ్‌హౌస్‌లు, మామిడితోటలకు పేరొందిన పూడూరు మండలంలోని భూములకే అధికంగా ప్రాధాన్యమిచ్చేవారు. నేవీ రాడార్ కేంద్రం ద్వారా వెలువడే రేడియేషన్ ప్రభావంతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదముందని, వివిధ దుష్పరిణామాలు ఉంటాయనే ప్రచారంతో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుప్పకూలింది. ఇప్పటికే భూములను కొన్న వారు అవి అమ్ముడుపోక.. చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

### నాడు రూ. వేల కోట్లు.. నేడు రూ. వందల కోట్లు..

జిల్లాలో 18 రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నా యి. ఈ ఆఫీసుల నుంచి కేసీఆర్ హయాంలో ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ. వేల కోట్ల రాబడి సమకూరేంది. ప్రతి నెలా జిల్లా నుంచి రూ. 300–రూ. 400 కోట్ల వరకు ఆదాయం వచ్చే ది. ప్రతిరోజూ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు క్రయవిక్రయదారులతో కిటకిటలాడేవి. అయి తే.. రేవంత్ సర్కార్ తీసుకున్న చర్యలతో క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో ప్రతినెలా ఆదాయం రూ. వందల కోట్లలోపే ఉంటున్న ది. జిల్లాలోనే అత్యధికంగా ఆదాయం సమకూ రే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, పెద్దఅంబర్‌పేట, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం వంటి రిజిస్ట్రేషన్ కార్యాలయాలూ క్రయవిక్రయాలు లేక వెలవెలబోతున్నాయి.

#### ఆదిబట్లలోనూ అంతంతే..

గతంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఆదిబట్ల పెట్టింది పేరుగా ఉండేది. ఈ మున్సిపాలిటీలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వందల సంఖ్యలో ఉన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు వచ్చి టీసీఎస్ పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు అధిక సంఖ్యలో కొనేవారు. అయితే, రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడంతో నేడు ఎవరూ అక్కడ భూములు, ఫ్లాట్లు కొనేందుకు ముందు రావడం లేదు. ఆదిబట్ల, మంగల్‌పల్లి, పటేల్‌గూడ, బొంగ్లూరు తదితర ప్రాంతాల్లోనూ ప్లాట్ల క్రయవిక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి.

**- సంరెడ్డి మహిపాల్‌రెడ్డి**



నా స్వస్థలం కృష్ణా జిల్లా. హైదరాబాద్‌లో ఉంటున్నా. శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, యాచారం తదితర ప్రాంతాల్లోని అపార్ట్ మెంట్లలోని ఫ్లాట్లు, వ్యవసాయ భూములను మా జిల్లావాసులు.. తెలిసిన వారికి ఇప్పించి కమీషన్ తీసుకునేది. కాంగ్రెస్

#### ఉపాధి కరువైంది..

సర్కార్ తీసుకుంటు న్న చర్యలతో ఎవరూ భూములను కొనేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఉపాధిని కోల్పోయా. నాతోపాటు చాలామంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. వారు కూడా రోడ్డున పడ్డారు.

**-రమేశ్‌బాబు, హైదరాబాద్**



## మంత్రి రాక..ప్రారంభం కాక..

- ఆరోగ్యశాఖ మంత్రి గారూ.. 300 పడకల దవాఖానను ప్రారంభించండి..
- మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురండి : విజ్ఞప్తి చేస్తున్న ప్రజలు, రోగులు

వికారాబాద్, మార్చి 8 : 300 పడకల దవాఖాన ప్రారంభం ఎప్పుడో.. అని రోగులు, ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని 50 పడకల ప్రభు త్వ ఏరియా దవాఖానకు రోజురోజుకూ రోగుల తాకిడి పెరుగుతున్నది. ప్రతిరోజూ దాదాపుగా వెయ్యి మంది వరకు వైద్యం కో సం వస్తున్నారు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభు త్వం రోగులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు రూ.30 కోట్లతో మరో 300 పడకల దవాఖానను ఏర్పాటు చేసింది. చిన్న చిన్న పనులు ఉండగా ఇటీవల పూర్తయ్యాయి. అయితే, గత రెండు, మూడు నెలల కిందటే ఈ దవాఖాన ప్రారంభోత్సవం కావాల్సి ఉండగా.. వైద్యారోగ్య శాఖ మంత్రి గారు రాకపోవడంతో పెండింగ్‌లో పడిపోయింది. మంత్రిగారు స్పం దించి ఆస్పత్రిని ప్రారంభిస్తే తమకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రజలు, రోగులు కోరుతున్నారు.




ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ దవాఖాన

### ఆన్‌లైన్‌లో కనిపించదు..

## పేమెంట్‌కు అవకాశం ఇవ్వదు

- సాంకేతిక సమస్యలతో దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు
- సమస్యల వలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ
- పేమెంట్ మోడ్ కనిపించకపోవడంతో జనాల్లో ఆందోళ న
- పనిచేయని అప్లికేషన్ సెర్చ్ ఆప్షన్

సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంలో సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులకు కొత్త ఇబ్బందులను సృష్టిస్తున్నాయి. తాజాగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాలని నోటీసులు అందుకున్న వారు కూడా ఫీజు చెల్లించకలేకపోతున్నారు. కొందరికీ మైన స్ బ్యాలెన్స్‌తో బిల్లు జనరేట్ కావడంతో... అసలు ఏం జరుగుతుందో దరఖాస్తుదారులకు అంతు చిక్కడం లేదు. ఇక గతంలో ఎప్పుడో చెల్లించిన ఎల్ఆర్ఎస్ ఫీజు రసీదులోని వివరాలతో తాజాగా అప్లికేషన్ పురోగతి తెలుసుకునే వీలు లేకపోవడంతో దరఖాస్తుదారులకు తమ ఇబ్బందుల గురించి ఎవరినీ ఆశ్రయించాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికీ లక్షలాది అప్లికేషన్లకు ఫీజు చెల్లించాలని నోటీసులు రాకపోవడంతో... ఎల్ఆర్ఎస్ ప్రక్రియ గందరగోళంగా మారుతున్నది. అందుబాటులో ఉన్న లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంతో దరఖాస్తుదారులు చుక్కలు చూస్తున్నారు. రాయితీ గడువు తేదీ ముంచుకొస్తుండడంతో... ఫీజులు చెల్లించేందుకు, దరఖాస్తుల వివరాలు తెలుసుకోలేకపోతున్నారు.



హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 8 లక్షలకు పైగా మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా... ఇందులో కొంతమందికి ఫీజు పేమెంట్ ఇంటిమేషన్ వచ్చింది. మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో ఉండగా... ఆయా దరఖాస్తుల స్టేటస్ తెలుసుకోవడం కూడా గగనంగానే మారింది. దీంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఎలా ముందుకు సాగుతుందనేది తెలుసుకోలేక గందరగోళానికి గురవుతున్నారు.

#### పేమెంట్ లింకులు వస్తున్నా..

ఇక ఫీజులు చెల్లించిన వారికి పేమెంట్ లింకులు వస్తున్నా... వెబ్‌సైట్ సర్వర్‌లో తలెత్తున్న సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఈ క్రమంలో హెచ్ఎండీఏ అధికారులు దృష్టి సారించి... ఈ పరిధిలోనే గతంలో చెల్లించిన ఫీజుల వివరాలు, ప్రస్తుతం ఆ దరఖాస్తుల స్టేటస్ తెలుసుకునే వెసులుబాటుతో పాటు, నిత్యం వస్తున్న సాంకేతిక సమస్యలకు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేదంటే... నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించకపోతే రావాల్సిన 25శాతం రాయితీని కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు.

#### ఆన్‌లైన్‌లో కనిపించదు..

ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు గా అధికారులు చెబుతున్నారు. నిజానికి వివరాలు వెతికే ప్రయత్నం చేస్తే ఏది కనిపించడం లేదు. ముఖ్యంగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన రసీదు నంబర్ ఆధారంగా అప్లికేషన్ సెర్చ్ చేస్తే గనుక తప్పుడు వివరాలంటూ నోటిఫికేషన్ వస్తుంది. అదేవిధం గా జిల్లా, మండలం, గ్రామాల వారీగా, వెంచర్ వివరాలను వెతికినా... ఫలితం శూన్యమే. కనీసం ఫీజులు చెల్లించిన వివరాలు కూడా వెబ్‌సైట్‌లో కనిపించకపోవడంతో... తాము చెల్లించిన ఎల్ఆర్ఎస్ ఫీజుతో ప్రాసెస్ చేస్తారా? లేదా అని కూడా తెలుసుకోలేకపోతున్నారు.

## కర్ణాటక నుంచి కల్తీ జ్యూస్

యాలాల : కర్ణాటక నుంచి తాండూరుకు అక్రమంగా తరలిస్తున్న కల్తీ, కాలం చెల్లిన జ్యూస్ ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన ఓ వ్యాపారి కంపెనీ పేరు, తుది గడువు తేదీ లేకుండా నైస్ ఫ్రూటీ పేరుతో ఉన్న కల్తీ ప్యాకెట్లను పలు ప్రాంతాలకు తరలిస్తున్నాడు. కాగా తాండూరు పట్టణంలో కల్తీ జ్యూస్ ప్యాకెట్లను విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు టాటాఏస్ వాహనాన్ని తనిఖీ చేసి.. అక్రమంగా తరలిస్తున్న 67 బస్తాల కంపెనీ పేరు, గడువు తేదీ లేని ఐస్‌క్రీం బస్తాలను స్వాధీనం చేసుకొని.. డ్రైవర్‌గా ఉన్న యజమానితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని తాండూరు పోలీసులకు అప్పగించారు.





టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్న నిందితులు ఇన్‌సెట్లో (కల్తీ జ్యూస్ ప్యాకెట్లు)

# అంతా మా ఇష్టం..

- అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల సందడి
- ప్రత్యేక అధికారికి సమాచారం ఇవ్వకుండానే రోడ్డు పనుల ప్రారంభం!

మొయినాబాద్, మార్చి 8 : మండలంలోని బాకారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 5లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ గ్రామానికి తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమాన్ని అయినా ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రారంభించాలి. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అన్ని పనులను ప్రత్యేక అధికారులు నిర్వహించే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ, ఇటీవల బాకారం గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రత్యేక అధికారికి సమాచారం ఇవ్వకుండానే పంచాయతీరాజ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. సొంత నిధులతో పనులను చేపట్టినట్లుగా అధికార పార్టీ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించడంపై ప్రతిపక్ష పార్టీల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ డీఈ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ బాకారం గ్రామానికి ప్రత్యేక అధికారి అని అనుకోలేదని, ఇక నుంచి చేపట్టే కార్యక్రమాలకు అతడికి సమాచారం ఇస్తామని పేర్కొనడం కొసమెరుపు.

బాకారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అధికార పార్టీ నాయకులు

